# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 23-07-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈరోజు ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యేక ఆర్థిక సాయం ప్రకటించారు.
- కేంద్రప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సహకారం రాష్ట్ర పునర్నిర్మాణానికి ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకుని కేంద్రబడ్జెట్ రూపొందించామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు.
- నీట్ యూజీ-2024 పునః పరీక్షను నిర్వహించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్ట్ స్పష్టం చేసింది.

==========================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈరోజు ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యేక ఆర్థిక సాయం ప్రకటించారు. రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్ల రూపాయల ఆర్థిక సాయం వివిధ అభివృద్ధి ఏజెన్సీల ద్వారా ఇవ్వనున్నామని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టానికి అనుగుణంగా పోలవరం సత్వర నిర్మాణానికి సంపూర్ణ సాయం అందిస్తామని కేంద్రమంత్రి తెలిపారు. రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వనున్నామని ప్రకటించారు. రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు మంజూరు చేస్తామని కేంద్ర మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌లోని కేంద్రాలకు ప్రత్యేక సాయం చేస్తామన్నారు. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాలకు నీళ్లు, విద్యుత్, రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు.

==========================

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా ఏడవ సారి కేంద్ర బడ్జెట్‌ని ఈరోజు ఉదయం లోక్ సభలో ప్రవేశపెట్టారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం పేదలు, మహిళలు, యువత, రైతులపై ప్రత్యేక దృష్టి సారించిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ బడ్జెట్ లో ప్రధానంగా నూతన పన్ను విధానంలో కేంద్ర ఆర్థిక మంత్రి మార్పులు చేశారు. పన్ను శ్లాబుల్లో మార్పుతో పాటు ప్రస్తుతం స్టాండర్డ్ డిడక్షన్ రూ.50 వేల రూపాయలు ఉండగా ఆ మొత్తాన్ని రూ.75 వేలకు పెంచామన్నారు. మొబైల్ ఫోన్లు లాంటి ఎలక్ట్రానిక్ పరికరాలపై విధించే సుంకాన్ని 15 శాతానికి తగ్గించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 3 కోట్ల అదనపు ఇళ్ళు నిర్మించనున్నామన్నారు. ప్రకృతి వ్యవసాయంలోకి దేశవ్యాప్తంగా కోటి మంది రైతులను తీసుకొచ్చే ప్రణాళిక రూపొందించామన్నారు. రానున్న ఐదేళ్లలో 20 లక్షల మంది యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నానమని మౌలిక సదుపాయాల కల్పనకు రూ.11.11 లక్షల కోట్ల రూపాయలు కేటాయించామని జీడీపీలో ఇది 3.4 శాతానికి సమానమన్నారు. మహిళలు, బాలికల కోసం రూ.3 లక్షల కోట్ల రూపాయలు వివిధ పథకాలకు... అదే విధంగా విద్య, ఉపాధి, నైపుణ్యాలభివృద్ధికి రూ.1.48 లక్షల కోట్లు కేటాయించామని మంత్రి వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు కేటాయించినందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధన్యవాదాలు తెలిపారు. శాసన సభ సమావేశాల్లో ఈరోజు చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అవసరాలను గుర్తించి రాజధాని, పోలవరం, పారిశ్రామిక రంగాలపై దృష్టి సారించినందుకు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం నుంచి వచ్చే సహకారం రాష్ట్ర పునర్నిర్మాణానికి చాలా ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్రానికి విశ్వాసాన్ని పెంచే బడ్జెట్‌ను సమర్పించినందుకు చంద్ర బాబు నాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని అభినందిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నీట్ యూజీ 2024 పునః పరీక్షను నిర్వహించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్ట్ స్పష్టం చేసింది. నీట్ ప్రశ్నాపత్రం లీకయిన మాట వాస్తవమేనని కాని దాని వల్ల పరిమిత సంఖ్యలో మాత్రమే లబ్ది పొందారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్ట్ కేంద్రాన్ని ఆదేశించింది. నీట్ పరీక్షను మళ్ళీ నిర్వహిస్తే 24 లక్షల మంది విద్యార్థులు నష్ట పోతారని సుప్రీంకోర్ట్ తీర్పు వెలువరించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్ర ప్రభుత్వం రెండు కీలక బిల్లులను ఈరోజు శాసనసభలో ప్రవేశ పెట్టింది. ఆంధ్రప్రదేశ్ భూ యాజమాన్య హక్కు చట్టం (ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్-2022) రద్దు, ఆరోగ్య వర్సిటీ పేరు మార్పు బిల్లులకు శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. విజయవాడలోని ఆరోగ్య వర్సిటీకి ఎన్టీఆర్ పేరుని పునరుద్ధరించారు. ఈ మేరకు సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు సభలో ప్రకటన చేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గంలో మంత్రి కందుల దుర్గేష్ పర్యటించారు. ఉండ్రాజవరం మండలం కాల్దరి, పసలపూడి, సూర్యారావుపాలెంలో నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. రైతులను అడిగి పంట నష్టం వివరాలను తెలుసుకున్నారు. అలాగే పునరావాస కేంద్రాలకు తరలించిన బాధితులను పరామర్శించి వారికి కల్పిస్తున్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎర్రకాలువ ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లానని ఆయన సానుకూలంగా స్పందించారని మంత్రి తెలియజేసారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తూర్పు మధ్యప్రదేశ్ దానిని ఆనుకుని ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో సగటు సముద్ర మట్టం నుండి 7.6 కి.మీ ఎత్తు వరకు విస్తరించిన ఉపరితల ఆవర్తన ఇప్పుడు జార్ఖండ్ పరిసర ప్రాంతాలపై ఉంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో తేలికపాటి నుండి మోస్తరు వర్షము ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని బలమైన గాలులు గంటకు 30-40 కిలోమీటర్లు వేగంతో వీచే అవకాశముందని అమరావతి లోని భారత వాతావరణ కేంద్ర అధికారి తెలియజేస్తూ....

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కృష్ణానది పరివాహక ప్రాంతాలు ముంపుకు గురైతే లంక గ్రామాల్లోని ప్రజలను సంరక్షించడానికి ప్రణాళిక రూపొందించుకోవాలని బాపట్ల జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అన్నారు. కృష్ణానదీ పరివాహక ప్రాంతాల్లోకి వరద వస్తే ముంపుకు గురయ్యే గ్రామాల సంరక్షణ చర్యలపై కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఈరోజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కృష్ణా నది కరకట్ట బలహీనంగా ఉన్న గట్లను గుర్తించాలన్నారు. మరమ్మతు చర్యలకు యుద్ధప్రాతిపదికన అంచనాలు రూపొందించాలని జల వనరుల శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భూ సంస్కరణల్లో భాగంగా వివిధ రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రాంతాల భూములకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య భూ ఆధార్‌ను కేటాయించాలని, పట్టణ భూ రికార్డులను డిజిటైజేషన్ చేయాలని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈరోజు కేంద్ర బడ్జెట్ ప్రసంగంలో నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ భూ సంస్కరణలు తీసుకొచ్చేందుకు రాష్ట్రాలతో కలిసి కేంద్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. రానున్న మూడేళ్లలో వీటిని పూర్తి చేసేందుకు వీలుగా అవసరమైన ఆర్థిక సాయాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో భూ పరిపాలన, ప్రణాళిక, నిర్వహణతోపాటు పట్టణ ప్రాంతాల్లో నగర ప్రణాళిక బాధ్యతలను ఈ మూడేళ్లలో రాష్ట్రాలు నెరవేర్చాల్సి ఉంటుందని నిర్మలా సీతారామన్ స్పష్టంచేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గోదావరి వరద ఉదృతి తగ్గేవరకు లంక, లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ సి నాగరాణి అన్నారు. పునరావాస కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించామని లంక గ్రామాల ప్రజలు రావాలని కలెక్టర్ కోరారు. ఈరోజు ఆచంట మండలం కోడేరు వద్ద గోదావరి ఉధృతిని పరిశీలించారు. ప్రజలు, నాయకులతో కలక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం మనకు వర్షాలు లేకపోయినా, ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా వరద రూపంలో ప్రమాదం వచ్చే అవకాశాలు ఉన్నాయని. యధాస్థితికి వచ్చేవరకు లంక, లోతట్టు గ్రామాల వాసులు పునరావాస కేంద్రాలకు, సురక్షిత ప్రాంతాలకు తరలి రావాలని కోరారు. పునరావాస కేంద్రానికి వచ్చిన ఏ ఒక్కరికీ ఇబ్బందులు కలగకుండా వారికి వసతి ఏర్పాటుతోపాటు అల్పాహారం, భోజన సౌకర్యం, వైద్య సహాయం అందించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ నగరాన్ని మరింత అందమైన నగరంగా తీర్చి తిద్దేందుకు విశేష కృషి చేస్తానని గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ నూతన కమిషనర్ పి.సంపత్ కుమార్ అన్నారు. గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా సంపత్ కుమార్ ఈరోజు ఉదయం పదవి బాధ్యతలు చేపట్టారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =